# "సహకారం" పై మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించి సహకారాభివృద్ధి విధానం రూపొందించాలి

## - సహకార సంరక్షణ సమితి

హైదరాబాద్ 2-12-99: సహకార మంత్రి వర్గ ఉపసంఘాన్ని నియమించి సహకారాభివృద్ధి విధానమును రూపొందించాలని కోరుతూ "సహకార సంరక్షణ సమితి" రాష్ట్ర కన్వీనింగ్ కమిటి ఓ విజ్ఞన పత్రాలన్ని ముఖ్యమంత్రి శ్రీ నారాచంద్రబాబు నాయుడు వారికి నివెందించిందని కమిటి కన్వీనర్ శ్రీ సంభారపు భూమయ్య తెలియజేశారు. ఆ విజ్ఞాపన పూర్తి పాఠం.

స్వర్ణాంధ్రసాధనకు 12 మంత్రివర్గ ఉపసంఘాలు నియమించి కార్యాచరణ పథకాల రూపకల్పనా చర్యలు తీసుకోవడము పట్ల "సహకార సంరక్షణ సమితి" (Co-operative Movement Protection Council) రాష్ట్ర కన్వీనింగ్ కమిటి మిమ్ము హృదయ పూర్వకంగా అభినందిస్తుంది.

"సహకార సంరక్షణ సమితి" జాతీయంగా, రాష్ట్రీయంగా సహకార ఉద్యమ ప్రయోజనాల సంరక్షణకు కృషి చేయటానికి 1993 సంవత్సరంలో ఏర్పడినది. ఇది సహకార వేత్తలు, నాయకుల, సామాజిక వేత్తల, సహకార ఉద్యోగులతో ఏర్పడిన అసోసియేషన్. పలు సందర్భాలలో వివిధ అంశాలపై సహకార సంస్థలు ఎదుర్కొంటున్న సమస్యలపై పలు సూచనలను ప్రభుత్వాల దృష్టికి, ప్రజల దృష్టికి తీసుకువచ్చి అనుకూలమైన పరిష్కారాలు పొందటంలో "సహకార సంరక్షణ సమితి" తనవంతు కృషి చేసింది.

నేడు రాష్ట్రంలో రైతుల పెట్టుబడి అవసరాలు సుమారు రూ. 10,000 కోట్లు అవుసరముకాగా, సహకార రంగం సుమారు రూ. 2,000 కోట్లు అందిస్తున్నది. సహకార సంస్థలు 12 నుండి 15 శాతం వరకు వడ్డీ వసూలు చేస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం గత సంవత్సరం అరున్నర శాతం వడ్డీరాయితీ కల్పించింది. కాని రైతాంగం మిగతా 8 వేల కోట్ల రూపాయలు వడ్డీ వ్యాపారులు, ఫైనాన్స్ సంస్థలు, ఇతర మార్గాల ద్వారా పెట్టుబడులు పొంది సేద్యం చేస్తున్నారు. ఈ ప్రైవేటు సంస్థలు తక్కువలో తక్కువగా 36 నుండి 60 శాతం వరకు వడ్డీ వసూలు చేస్తున్నారు. వ్యవసాయంలో లభించే కొద్దిపాటి మిగులు వడ్డీ వ్యాపారులను పోషించడానికి సరిపోతుంది. స్వాతంత్ర్యం వచ్చిన 50 సం.రాల అనంతరం కూడా వడ్డీ వ్యాపారుల కబంధ హస్తాల నుండి రైతాంగాన్ని విముక్తుల్ని చేయలేకపోయాం. అంతేకాకుండా చిన్న, సన్నకారు రైతులకు అనుకూలంగా ఉండే సహకార మార్కెటింగ్ వ్యవస్థ బలవత్తరంగా ఉండకపోవడం వలన, తమ ఉత్పత్తులను కల్లంలోనే మధ్యదళారులకు అమ్మి, గిట్టుబాటు ధర పొందలేకపోతున్నారు.

దేశ ఆర్థిక వ్యవస్థకు సింహభాగాన్ని అందిస్తున్న రైతు వడ్డీవ్యాపారుల, మధ్యదళారుల కబంధ హస్తాల నుండి విముక్తి చేయడానికి తమరు నిర్దేశిస్తున్న స్వర్ణాంధ్ర సాధనకు, వ్యవసాయంపై ఆధారపడిన 70 శాతం ప్రజానీకానికి మేలు జరుగుటకు "సహకార రంగం" లో తీసుకోవలసిన నిర్దిష్ట చర్యలను "సహకార సంరక్షణ సమితి" రాష్ట్ర కన్వీనింగ్ కమిటి సూచిస్తోంది.

### "విజన్ - 2020" ఆవిష్కరణ సభలో తమరి ప్రసంగానికి కార్యాచరణ పథకం :

స్వర్ణాంధ్ర సాధనకు మొదటి మెట్టుగా "విజన్-2020" రూపొందించి, 26 జనవరి 99 నాడు "విజన్-2020" ముసాయిదా డాక్యుమెంట్ ఆవిష్కరణ సభలో తమరు ఈ క్రింది విధంగా పేర్కొన్నారు.

1. *"గత 50 సంవత్సరాలతో పెరిగిపోయిన అసమానతలను రానున్న 20 సంవత్సరాలలో తొలగించడానికి ఈ "విజన్" డాక్యుమెంట్‌ను రూపొందించాము."*

### వికేంద్రీకరణకు మార్గము - సహకార విధానం :

గత 50 సంవత్సరాలలో మనము అనుసరించిన ఆర్థిక విధానాల మూలంగా ఆర్థిక కేంద్రీకరణ జరిగి ప్రజల మధ్య అసమానతలు పెరిగి పోయినాయని గుర్తించి, ఈ అసమానతలను తొలగించుటయే ధ్యేయమని పేర్కొన్నారు. అనగా సంపద "కేంద్రీకరణ"కు బదులుగా "వికేంద్రీకరణ" విధానాలు అమలు పరుచటం ద్వారా అసమానతలను తొలగించటం సాధ్యమవుతుంది. వికేంద్రీకరణ జరగటానికి ఏకైక మార్గం, "సహకార విధానము" అనగా మీ ఉదాత్తమైన లక్ష్యం సిద్ధించటానికి 'సహకార విధానము అమలు పరచాలని అభిలషించారు.

2. *"70 శాతం ప్రజలు ఆధారపడిన వ్యవసాయ రంగంలో నాలుగు రెట్లు అభివృద్ధిని సాధించాలని, ఇందుకుగాను ఏడాదికి 6 శాతం అభివృద్ధి రేటును సాధించాలని లక్ష్యంగా పెట్టుకొన్నాం. ఆధునిక పద్ధతుల ద్వారా వ్యవసాయాన్ని బాగా అభివృద్ధి చేసి, వ్యవసాయాధారిత ప్రజలందరికి ఉపాధి కల్పించాలని అనుకుంటున్నాము".*

### "మాక్స్ యాక్ట్" పరిధిలో నూతనంగా "పరస్పర సహాయ సేద్య సహకార సంఘాలు" :

ప్రస్తుతం 3.7 శాతంగా ఉన్న వ్యవసాయాభివృద్ధి రేటును 6 % కు పెంచాలని ఆశిస్తున్నారు. కాని వాస్తవ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. రోజు రోజుకు భూకమతాలు విభజించబడి మరియు ఇతర కారణాల వలన చిన్న, సన్నకారు రైతుల సంఖ్య గణనీయంగా పెరిగిపోతుంది. ఈ చిన్న కమతాలలో ఆధునిక వ్యవసాయం ఎలా సాధ్యం?



Scanned by CamScanner

ప్రత్యామ్నాయంగా, భారత సహకార ఉద్యమానికి ఆదర్శంగా తీసుకువచ్చిన ''పరస్పర సహాయ సహకార చట్టం, 1995''ను క్రొత్త క్షేత్రాలలో విస్తరింపచేయడం ద్వారా తమరు ఆశించిన 6 శాతం అభివృద్ధిని సాధించవచ్చును. ''1995 పరస్పర సహాయ సహకార చట్టం'' పరిధిలో ఒకే ఆయకట్టు ప్రాంతంలో కాని, నిర్ణీత విస్తీర్ణంలో కాని పరిమితమైన రైతుల (25 నుండి 50)చే ''పరస్పర సహాయ సేద్య సహకార సంఘాలు'' ఏర్పరచుటకు రైతులను ప్రోత్సహించడము, వారికి మౌళిక సదుపాయాలు కల్పించడం ద్వారా వారు అధునాతన పద్ధతుల ద్వారా అధికోత్పత్తి ప్రయోజనాలు పొందటమే కాక తమ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కూడ పొందగలుగుతారు. ఈ విధానంలో రైతు తన భూమిపై హక్కును ఏమాత్రం కోల్పోడు.

3. ''వ్యవసాయ ఆధారితంగా ఉన్న ఆర్థిక వ్యవస్థను పరిశ్రమలు, సేవల ఆధారిత ఆర్థిక వ్యవస్థగా మార్చాలని లక్ష్యంగా నిర్ణయించుకొన్నాము.''

## గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో సహకార విధానం అమలు :

తమరు నిర్ణయించుకున్న పైలక్ష్యం సాధించటానికి, భారత ఆర్థిక వ్యవస్థను రెండు భాగాలుగా చూడాల్సి ఉంది.

1. పారిశ్రామిక, వ్యాపార ఆర్థిక వ్యవస్థ
2. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ.

వ్యవసాయ ఆధారితంగా ఉన్న ఆర్థిక వ్యవస్థను పరిశ్రమలు సేవల ఆధారిత ఆర్థిక వ్యవస్థగా మారాలంటే, పరిశ్రమల వినిమయ ఉత్పత్తులకు, సేవలకు ''డిమాండ్'' పెరగాలి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో అధిక సంఖ్యలో నున్న చిన్న, సన్నకారు రైతుల (మధ్య తరగతి ప్రజలు)లో కొనుగోలు శక్తి పెంచుట ద్వారా పరిశ్రమల వినిమయ ఉత్పత్తులకు ''డిమాండ్'' పెంచవచ్చు. వారి వ్యవసాయ పెట్టుబడి ఖర్చులు తగ్గించి, ఉత్పత్తి ఆదాయం పెంచే విధానం అమలు చేయటం అనగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో ''సహకార విధానం'' పూర్తిగా అమలు చేయాలి. ఈ గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో ప్రైవేటు, బహుళ జాతి ఫైనాన్స్, బ్యాంకింగ్ సంస్థలు ప్రవేశించకూడదు. ఆరకంగా సహకార రంగం ద్వారా పరపతి, మార్కెటింగ్ సేవలు అందటంచే వారిలో ఖర్చు తగ్గి, పొదుపు పెరుగుతుంది. సామాజిక (సహకార సంఘాలు) ఆస్తులు పెరిగి నేటి ప్రపంచీకరించిన పోటీ ఆర్థిక వ్యవస్థలో చిన్న, సన్నకారు రైతులకు భద్రత ఏర్పడుతుంది. ఉభయ తారకంగా గ్రామీణ కుటుంబాలలో కొనుగోలు శక్తి పెరిగి పరిశ్రమల వినిమయ ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతుంది. తద్వారా పరిశ్రమ అభివృద్ధి చెందుతుంది.

పై విధంగా కాకుండా గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో బహుళ జాతి, ప్రైవేటు ఆర్థిక సంస్థలకు పాల్గొనుటకు అవకాశం కల్పిస్తే, చిన్న, సన్నకారు రైతు ఉనికే ప్రశ్నార్థకంగా మారుతుంది. వారి వ్యవసాయ పెట్టుబడి ఖర్చులు పెరిగి సహకార మార్కెటింగ్ వ్యవస్థ బలోపేతంగా లేదు కాబట్టి వారి ఉత్పత్తులు దళారులకు అమ్మాల్సి వస్తుంది. జీవనాధారం కొరకు వ్యవసాయం చేయడం కష్టతరమవుతుంది. బహుళ జాతి కంపెనీలు ప్రాసెసింగ్ కంపెనీల పేరున వారి భూమిని కొనే అవకాశాలుంటాయి. ఆరకంగా చిన్న, సన్నకారు రైతుల నిరాశ్రయులవుతారు. తదనుగుణంగా గ్రామీణ ప్రజలు ముఖ్యంగా మధ్య తరగతి ప్రజల కొనుగోలు శక్తి పడిపోతుంది. ''డిమాండ్'' తగ్గి, పరిశ్రమ రంగంలో మాంద్యము ఏర్పడి, భారత ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతుంది.

స్వర్ణాంధ్రప్రదేశ్ ధ్యేయంతో తమరు పేర్కొన్న ఉదాత్త లక్ష్యాలు సాధించటానికి 'సహకార'పై మంత్రివర్గ ఉప సంఘం నియమించి కార్యాచరణ పథకం రూపొందించాలని సహకార సంక్షేమ సమితి రాష్ట్ర కన్వీనింగ్ కమిటి సవినయంగా అభ్యర్థిస్తుంది.

రాష్ట్ర ప్రభుత్వం సహకార రంగం అభివృద్ధికి ఈ క్రింద పేర్కొనబడిన నిర్దిష్ట చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

## రాష్ట్ర సహకార అభివృద్ధి విధానమును రూపొందించాలి :

ఎ) ఈ విధానంలో భూమి గల ప్రతిరైతుకు పరపతి సౌకర్యం కల్గించే ధ్యేయం, వారి ఉత్పత్తులను నిల్వ ఉంచి మార్కెటింగ్ సౌకర్యం కల్గించే లక్ష్యాలు నిర్దేశించాలి.

బి) 1995 పరస్పర సహాయ సహకార చట్టం పరిధిలో ''పరస్పర సహాయ సేద్య సహకార సంఘాల'' ప్రోత్సాహానికి ప్రాధాన్యత, ప్రచారం నిర్వహించి, వాటి అభివృద్ధి, మౌళిక సదుపాయాలు కల్గించే లక్ష్యాలుండాలి.

సి) గ్రామీణ యువకులకు ''స్వయం ఉపాధి పరస్పర సహాయ సహకార సంఘాలు'' ఏర్పాటుకు ప్రోత్సాహం, సదుపాయాలు కల్పించి గ్రామాలలో కాంట్రాక్టర్‌లేని వ్యవస్థకు కృషి చేసి ఆ దిశలో లక్ష్యాలు నిర్దేశించాలి.

డి) ''రైతు బజార్, వ్యవస్థను సహకార విధానం ద్వారా అభివృద్ధి పరచాలి.

ఇ) ''జన్మభూమి'' కార్యక్రమంలో సహకార రంగం చేర్చాలి. PACS లో సభ్యుల ఆధిపత్యం, will full defaulters, డిపాజిట్లు మొదలగు అంశాలపై జన్మభూమి కార్యక్రమాల ద్వారా సభ్యులను చైతన్య పరచాలి.

ఎఫ్) జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు, మార్కెటింగ్ సంఘ[illegible] మరియు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో పెరిగిపోతున్న 'ఇన్ బాలన్సెస్'' తగ్గించుకోవడానికి రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు ఆర్థిక చేయూతనివ్వాలి.

జి) రాష్ట్ర సహకార బ్యాంకుకు బాధ్యత వహిస్తూ, జిల్లా కేంద్ర సహకార బ్యాంకులోనున్న జనరల్‌మేనేజర్‌గా, జిల్లా బ్యాంకుకు బాధ్యత వహిస్తూ, ప్రాథమిక సంఘాలలో కార్యదర్శి ఉండాలి. ఈ దిశలో వేతన కార్యదర్శుల సమస్యను పరిష్కరించాలి.

హెచ్) చిన్న, సన్నకారు రైతుల భూములను బహుళ జాతి కంపెనీలు, ఇతర ఏ కంపెనీలు కొనుటను నిషేధించాలి.

**సహకార ఉద్యమ సేవలో**

(సంఖారపు ఘూమయ్య)
కన్వీనర్, రాష్ట్ర కన్వీనింగ్ కమిటి
''సహకార సంరక్షణ సమితి''



Scanned by CamScanner